గురుకుల పాఠశాలల్లో కోడింగ్ విద్య

మొయినాబాద్, జూన్14: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో కోడింగ్ విద్యను అందించడం జరుగుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ జోనల్ అధికారి నిర్మల అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలిక పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. పాఠశాల, కళాశాలకు మొదటి రోజు వచ్చిన విద్యార్థులకు పుష్ప గుచ్చం ఇచ్చి చాక్లెట్ పంపిణీ చేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులు ముగిసినందున తల్లిదండ్రులు తమ పిల్లలను సకాలంలో పాఠశాలకు, కళాశాలకు పంపిస్తే విద్యా సంవత్సరం వృథా కాదని చెప్పారు. విద్యార్థులు అన్ని అంశాలపై చైతన్యవంతులు కావడం కోసం విద్యార్థుల కోసం పాఠశాలలో వినూత్న కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కోడింగ్ విద్యను ప్రతి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. ఉన్నత విద్యలో నేర్చుకోవాల్సిన కోడింగ్ విద్యను పాఠశాల స్థాయి నుంచే 6, 7, 8, 9, 11 తరగతి విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులను వదిలి పాఠశాలకు వచ్చిన ఇంటి వద్దనే తల్లిదండ్రులతో ఉన్న భావన కలిగించడం కోసం ఫోన్ మిత్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడాలనుకున్నప్పుడు మాట్లాడవచ్చని అన్నారు. సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించడం కోసం కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడం కోసం గురుకుల విద్యా సంస్థ కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా

- మేడ్చల్ జిల్లాలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నకిలీ పత్రాలు సృష్టించి మరీ నిర్మాణాలు
- స్థానిక నేతలతో అధికారులు కుమ్మక్కు!
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్, జూన్14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూములలో కబ్జాదారులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 16 మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. జిల్లాలోని కొందరు నాయకులు.. స్థానిక అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములు ఉండే ప్రాంతాల్లో సర్వే నంబర్లు సృష్టించి మరీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సొమ్ముచేసుకుంటున్నారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల పరిధిలో ఆయా భూములకు ఉన్న డిమాండ్‌ను బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయించుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఇలాంటి నిర్మాణాలు కొనుగోలు చేస్తున్న నిరుపేదల భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతున్నారు. నిర్మాణాలను రెండు రోజులలో పూర్తిచేసి ఇంటి నెంబర్‌ను ఇచ్చేందుకు అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారంటే అవినీతి యే రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

ఆయా మున్సిపాలిటీల పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలతో పాటు స్థానిక తహసీల్దార్ కార్యాలయాలలో ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో అక్రమ నిర్మాణాలపై వందలాది సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికంగా ఉండే మున్సిపల్ అధికారులను కోరితే ఇంటి స్థలం పట్టా ఉందని పట్టాపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు దాటవేస్తున్నారాన్ని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా బోడుప్పల్, పీర్జాదిగూడ, పోచారం, మేడ్చల్, దుండిగల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనతో..

మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో అక్రమ నిర్మాణాల సంఖ్య మరింత పెరిగింది. ఆయా అధికారులు మున్సిపాలిటీల పర్యవేక్షణను పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆటగా మారింది పరిస్థితి. స్థానిక నాయకులు చేతులు తడపడంతో ప్రత్యేకాధికారులు అక్రమ నిర్మాణాలను చూసిచూడనట్లు వదిలేస్తున్నట్లుకూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 14: ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి డివిజన్ సర్దార్ పటేల్ నగర్‌లోని ప్రభుత్వ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని.. స్కూళ్లలో బాత్రూంలు, వంటగదులు నిర్మించాలని, మంచినీటి వసతి కోసం పవర్ బోర్ వేయించాలని అన్నారు. అంగన్‌వాడీ భవనాలతో పాటు బయట ప్రదేశంలో ఫ్లోరింగ్ చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బి ఆర్ ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు అశోక్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు సునీత, కళ్యాణి, మౌనిక, ఆశ వర్కర్ సునీత, సర్దార్ పటేల్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాములు, శ్రీకాంత్, లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన వాటా సాధించుకుందాం

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

తెలుగు యూనివర్సిటీ, జూన్ 14: దేశంలోని ఓబీసీలందరూ చైతన్యవంతులై సంఘటితంగా ఉన్నప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రముఖ రచయిత, ఐఎస్ఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, న్యాయవాది పృథ్వీ రాజ్ సింగ్ పరమార్ సంయుక్తంగా రచించిన 'ఓబీసీల పోరుబాట' పుస్తకావిష్కరణ సభ జన అధికార సమితి ఆధ్వర్యంలో శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గన్న ఎంపీ ఈటల మాట్లాడుతూ.. ఉన్నతమైన పదవీ బాధ్యతలలో కొనసాగుతూ సమాజహితం కోసం ఆలోచించే వ్యక్తులలో అరుదైన వ్యక్తి నరహరి అని అన్నారు. సామాజిక స్పృహ కొరవడిన ఓబీసీలలో చైతన్యం వచ్చేలా ఆయన రచించిన పోరుబాట పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలను ఎత్తి చూపుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయంగా విస్ఫోటనం కలిగించే పుస్తకం పోరుబాట అని అన్నారు. చట్టసభలలో బీసీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్న అరణ్య రోదనగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన వాటాను సాధించుకునేలా ఓబీసీలకు దశ దిశను కలిగించే పుస్తకం తీసుకురావడం పట్ల ఆయన రచయితలకు కృతజ్ఞతలు తెలిపారు. రచయిత నరహరి స్పందిస్తూ దేశంలోని 80 కోట్ల బీసీల ఆశయాలు, ఆశలు, సమస్యలు వాటి పరిష్కారాలపై ఓబీసీల పోరుబాట పుస్తకం రాశానని అన్నారు. రిజర్వేషన్లు అమలు చేస్తే అధికారంతో పాటు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి పూర్ణ చందర్‌రావుతో పాటు బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీల పోరుబాట పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న బీసీ నేతలు

నిమ్స్‌లో ఘనంగా రక్తదాతల దినోత్సవం

రక్తదానం అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఖైరతాబాద్, జూన్ 14: నిమ్స్‌లో రక్తదాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్లడ్ బ్యాంకు విభాగాధిపతి డాక్టర్ సుధీకర్ కుమార్ నేతృత్వంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, రక్తదాన కేంద్రం, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది నిమ్స్ పాత ఔట్‌పేషెంట్ బ్లాక్ నుంచి బ్లడ్ బ్యాంకు వద్దరు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వెయ్యి బ్లడ్ యూనిట్లు భద్రపర్చే సామర్థ్యం కలిగిన అడ్వాన్స్ టెక్నాలజీ కోల్డ్ రూమ్‌ను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది రక్తదానం చేశారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.శాంతి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ మహేశ్ కుమార్, అలైడ్ హెల్త్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శిరందాసు శ్రీనివాసులు, మీడియా రిలేషన్ అధికారి సత్యగౌడ్, హెలీ నీడి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మనోహర్ బాబు, శివరామకృష్ణ, ప్రకాశ్, తలసీమియా గ్రూప్ ప్రతినిధులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు

గొల్లకురుమలకు మంత్రి పదవులివ్వాలి

బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గంలో గొల్ల కురుమలకు స్థానం కల్పించాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. గొల్ల కురుమలకు జరుగుతున్న అన్యాయాలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 లక్షల జనాభా కలిగిన గొల్లకురుమలకు మంత్రి పదవి కేటాయించకపోవడం సరికాదన్నారు. జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర మంత్రివర్గంలో గొల్ల కురుమలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు ఎమ్మెల్సీ పదవులు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత పదవులలో ప్రాముఖ్యం కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న గొల్లకురుమ విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రాతినిధ్యం ఉన్నచోట గొల్లకురుమలకు డీసీసీ పదవులలో చోటు కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఎస్.ఎన్.టీ రిజర్వేషన్‌లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సబ్‌ప్లాన్ కమిటీ ఏర్పాటు చేయాలి..

తెలంగాణలో గొల్లకురుమల గొర్రెల విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రూ.10వేల కోట్లు సమకూరుతున్నాయని, వాటిని తిరిగి గొల్లకురుమల అభివృద్ధికి కేటాయించాలని అభిప్రాయపడ్డారు. గొల్లకురుమల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ కమిటీ ఏర్పాటుచేసి రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. యాదగిరిగుట్ట ఆలయ చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లలో 50% గొల్లకురుమలకి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూము నవీన్, నూకల మధు, వికాస్, సురేష్, కార్తీక్, అభిలాష్, రమేష్, శ్రీధర్, అనిల్, శంకర్, నవీన్, వినోద్, శ్రీనివాస్, సురేష్, శివ, మోహన్, సంతోష్, శ్రీకాంత్, శేఖర్, శోభన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఒక అడుగు ముందుకు..రెండడుగులు వెనక్కి

- ఓల్డ్‌సిటీ మెట్రోపై హెచ్ఎంఆర్ఎల్ భిన్న స్వరం
- నత్తనడకన భూసేకరణ పనులు
- పదుల సంఖ్యలో పెండింగ్‌లోనే కోర్టు కేసులు
- జాప్యంపై స్పష్టతనివ్వని యంత్రాంగం

సిటీబ్యూరో, జూన్ 14(నమస్తే తెలంగాణ): ఓల్డ్‌సిటీ మెట్రో పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యాయి. హైకోర్టు నిర్ణయంతో ప్రాజెక్టు ఆగలేదు కానీ పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. నిర్మాణాల కూల్చివేత, ఆస్తుల సేకరణలో ఇబ్బందులు ఎదురవుతుండటంతో అనుకున్న రీతిలో మెట్రో పనులు సాగడం లేదు. ఓల్డ్ సిటీ మెట్రో శంకుస్థాపన రోజునే 3 నెలల్లో భూసేకరణ పూర్తిచేయాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినా నిర్మాణ పనుల్లో ఆశించిన పురోగతి లేదు. ఇప్పటికీ మొత్తం గుర్తించిన ఆస్తులలో 30శాతం మేర నిర్మాణాలు మాత్రమే హెచ్ఎంఆర్ఎల్‌కు బదిలీ కాగా, మిగిలిన ఆస్తుల సేకరణ ఎప్పటిలోగా అవుతుందనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఓవైపు మెట్రో పనులు సాగుతున్నాయని చెబుతూనే... మరోవైపు హైకోర్టు వద్ద కేసులు విచారణలో ఉన్నాయంటూ సన్నాయి నొక్కులతో హైదరాబాద్ మెట్రో సంస్థ నెట్టుకొస్తోంది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ్‌గుట్ట వరకు నిర్మించనున్న 7.5 కిలోమీటర్ల మెట్రో ప్రాజెక్టు నత్తనడకన సాగుతున్నాయి.

నత్తనడకన భూసేకరణ..

మెట్రో కోసం భూసేకరణ వేగంగా జరుగుతున్నాయంటూనే... చారిత్రక కట్టడాలపై కోర్టు వ్యవహారాలు ప్రధాన ఆటంకంగా మారుతున్నట్లుగా ఉన్నతాధికారులు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఓల్డ్‌సిటీ మెట్రో పట్టాలెక్కిస్తామని చెప్పినా... 6 నెలలుగా భూసేకరణ నత్తనడకన సాగుతూనే ఉంది. మూడు నెలల్లోనే ఈ ప్రక్రియ పూర్తిచేసి, కూల్చివేతలు తుదిదశకు చేరాల్సి ఉన్నా... హెచ్ఎంఆర్ఎల్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం ప్రాజెక్టును మరింత ఆలస్యం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి.

ప్రతిపాదనలన్నీ కేంద్రం వద్దే...

ఫేజ్-2 విస్తరణలో భాగంగా చేపట్టిన ఓల్డ్ సిటీ మెట్రో ప్రాజెక్టును దాదాపు రూ.2,300 కోట్ల వ్యయంతో నిర్మించనుండగా... ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే గానీ, ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కానట్టే. ఇప్పటికే ఓల్డ్ సిటీ మెట్రోకు రైట్ ఆఫ్ వే, భూసేకరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. భూసేకరణ వేగవంతం చేశామని చెబుతున్నా...మొత్తం ఆస్తులలో సగం కూడా సేకరించలేదు.అడపాదడపా కొన్ని నిర్మాణాల వద్ద కూల్చివేతలు మొదలుపెట్టిన హెచ్ఎంఆర్ఎల్.. అదే తీరుగా పనులు సాగుతున్నట్లుగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎదురైన ఇబ్బందులతో అనుకున్న వేగంగా మాత్రం సంస్థ ముందుకు కదల్లేకపోతుందని సమాచారం.


సదస్సులో పాల్గొన్న డాక్టర్ జీఎస్ రావు, అతిథులు

యశోదలో ప్రపంచస్థాయి వైద్య విధానాలు

యశోద గ్రూప్‌ఆఫ్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జీఎస్ రావు

మాదాపూర్, జూన్ 13: దేశంలో కార్డియో వాస్కులర్ వ్యాధులు(సీవీడీ) రోజు రోజుకు పెరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఈ డిసీస్ అత్యధిక భారం ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటని యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, మేనేజింగ్ డైరెక్టర్, డా. జీఎస్ రావు అన్నారు. యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ ఆధ్వర్యంలో గుండె జబ్బులకు అత్యాధునిక చికిత్స విధానాలపై రెండు రోజుల అంతర్జాతీయ కార్డియాలజీ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జీఎస్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో సీవీడీ కి సంబంధించి వార్షిక మరణాల సంఖ్య 1990 నుంచి 2.26 మిలియన్లు ఉండగా 2020 వరకు 4.77 మిలియన్లకు పెరిగిందని అంచనా వేయబడినట్లు చెప్పారు. హార్ట్ డిసీజ్ ప్రాబ్లమ్ రేట్లు గత కొన్నేళ్లుగా అంచనా వేయబడగా గ్రామీణ జనాభాలో 1.6 శాతం నుంచి 7.4 శాతం వరకు ఉండగా, పట్టణ జనాభాలో 1 శాతం నుంచి 13.2 శాతం వరకు పెరిగినట్లు తెలిపారు. యశోద హాస్పిటల్ ప్రపంచ స్థాయి వైద్య విధానాలను అందించడంలో శిక్షణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుందని అన్నారు. గుండె అడ్డంకులను తొలగించడానికి ఇంట్రా వాస్కులర్ ఇమేజింగ్ వంటి అత్యాధునిక సాంకేతికత లేజర్ సహాయంతో యాంజియో ప్లాస్టి సమయంలో ప్లేక్ సవరణ కోసం ప్రోటాబ్లేషణ్, ఆర్బిటాల్ అథరెక్టమీ వంటి సాధనాలను ఎలా ఉపయోగించాలో లైవ్ వర్క్‌షాప్‌లో నిపుణులు వివరించారు. టీఏవీఆర్ విధానం ద్వారా గుండె కవాటాలను శస్త్ర చికిత్స లేకుండా మార్చడంలో అందుబాటులోకి వచ్చిన పురోగతి, ప్రత్యేక క్లిప్పులతో మరమ్మతు లేదా మెటల్ వాల్వ్ వంటి అధునాతన గుండె చికిత్స వైద్య విధానాలను నిపుణులైన జాతీయ, అంతర్జాతీయ ప్రధాన కార్డియాలజిస్టులు వాటి పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా కార్డియాలజీ వైద్యనిపుణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను గ్రామాల్లోకి రానివ్వం

- తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్
- బకాయిలు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

సమావేశంలో నినదిస్తున్న పృథ్వీరాజ్, సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్, జూన్ 14: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచ్‌ల బకాయిలు తీర్చేస్తామని.. లేని పక్షంలో గల్లాపట్టి అడగాలంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేశారని తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ మండిపడ్డారు. తెలంగాణ సర్పంచ్‌ల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అయితే ప్రభుత్వం చేసిన పనులకు డబ్బులు ఇవ్వకపోవడంతో అనేకమంది సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని.. మరికొందరు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశలు అడియాశలు చేశారు..

ఉన్నత చదువులు చదివినా తాము పుట్టి పెరిగిన గ్రామంపై ఉన్న మమకారంతో చాలా మంది యువత సర్పంచ్‌లుగా పోటీచేశారని, వారి ఆశలను ప్రభుత్వం అడియాశలు చేసిందన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారని.. స్వరాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచ్‌లకు మాత్రం బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన పనులకు డబ్బులు వస్తాయని, అప్పులు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేసిన సర్పంచ్‌లకు మాత్రం మొండిచేయి చూపుతున్నారన్నారు.

ట్రాక్టర్లు పెట్టి అడ్డుకుంటాం..

తెలంగాణ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. గడిచిన 18 నెలల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్పంచ్‌లను మభ్యపెడుతూ వస్తున్నారని, ఆయన జాగలమ్మి తమ డబ్బులు ఇవ్వమనడం లేదని, తమకు రావాల్సిన మొత్తాన్నే ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాలకు సంబంధించి బకాయిల్లో ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ రావాలని, తమ బకాయిలు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చివరకు నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని, ట్రాక్టర్లు అడ్డుపెట్టి అడ్డుకుంటామన్నారు. అంతకు ముందు మాజీ సర్పంచ్‌లు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యాలయం మూసి ఉండటంతో అక్కడే గేటు వద్ద వినతి పత్రాన్ని ఉంచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మల్లయ్య యాదవ్, పద్మా రెడ్డి, రవీందర్ రావు, నరేశ్ పాల్గొన్నారు.

వైష్ణవ జనాభా లెక్క తేలాలి

సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఎల్బీనగర్‌లోని శ్రీ వైష్ణవ సేవాసదన్‌లో శనివారం తెలంగాణలోని వివిధ వైష్ణవ సంఘాల జేఏసీ ఏర్పాటుతో పాటు శ్రీవైష్ణవుల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ గాయకుడు రామాచారి మాట్లాడుతూ.. శ్రీవైష్ణవ సంప్రదాయం చాలా గొప్పదని, దీనిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత వైష్ణవుల అందరిపై ఉందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో శ్రీవైష్ణవ జనాభా లెక్క తేలాల్సిన అవసరముందని, పేదలైన శ్రీవైష్ణవుల పిల్లల చదువు, వైద్యం, గృహనిర్మాణం తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన పీచర కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి సభ్యత్వ సేకరణ చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ అర్చక ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచార్యులు, మాజీ కార్పొరేటర్ నరేంద్రాచార్యులు, డింగరి రవికుమార్, కొదుమగుళ్ల సత్యనారాయణాచార్యులు, తిరువరంగం ప్రభాకర్, ఉత్పల అనంత్‌కుమార్, మధన్‌మోహన్, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు, శ్రీవైష్ణవ ట్రస్ట్ అధ్యక్షుడు యాదగిరి చార్యులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ చార్యులు, వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున శ్రీవైష్ణవులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ ఆత్మగౌరవ సభకు హాజరైన ప్రతినిధులు